బతుకుపోరుకు సన్నద్ధం

- వేటకు వలలు.. పడవలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు
- 15తో ముగియనున్న వేట విరామ సమయం



వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు



వేటకు సిద్ధం చేసిన ఫైబర్‌బోట్ల తాలూకు ఇంజిన్లు

ఎంవీపీ కాలనీ : బతుకుపోరుకు మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. దాదాపు 60 రోజుల విరామం తర్వాత తిరిగి చేపల వేటకు సిద్ధమవుతున్నారు. పెద్ద ఎత్తున వలలు సమకూర్చుకుంటున్నారు. అప్పుఘర్, వాసవానిపాలెం, పెదజాలరిపేట ప్రాంతాల్లోని మత్స్యకారులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ఏటా మే, జూన్ నెలల్లో ప్రభుత్వం అధికారికంగా వేట విరామం ప్రకటించే విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత కొంత కాలంగా తూర్పు నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు. అయితే జూన్ 15వ తేదీ అర్ధరాత్రితో విరామం గడువు ముగుస్తుండటంతో వేటకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం మత్స్యకార కాలనీల్లో ఎక్కడ చూసినా ఈ తరహా ఏర్పాట్లు, సన్నద్ధత కనిపిస్తున్నాయి. మరో రెండు వారాల్లో వేట విరామం ముగియనుండటంతో వలలు సరి చేసుకోవడం, పడవల మరమ్మతులు, ఇంజిన్ మరమ్మతుల వంటి పనుల్లో 18, 19వ వార్డు మత్స్యకారులు నిమగ్నమయ్యారు.

మత్స్యకార భరోసాతో ఆర్థిక భరోసా..

తూర్పు నియోజకవర్గంలో దాదాపు 6 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు చేపల వేట ప్రధాన జీవిస్తున్నాయి. ఇందులో అప్పుఘర్, వాసవానిపాలెంలో 2 వేల వరకు మత్స్యకార కుటుంబాలు ఉండగా పెదజాలరిపేట ప్రాంతంలో దాదాపు 4 వేల వరకు మత్స్యకార కుటుంబాలు నివాసముంటున్నాయి. సముద్ర తీరప్రాంతానికి ఆనుకొని జీవిస్తున్న వీరంతా చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ఏటా రెండు నెలలు వేటకు విరామం ప్రకటించాల్సి వస్తుండటంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ సమయంలో మత్స్యకారులందరికీ రూ.10 వేలు చొప్పున వేట విరామ భృతి చెల్లిస్తుండటంతో ఆ సాయం వారికి కొండంత అండగా నిలుస్తోంది.



వేటకు సరంజామా సర్దుకుంటున్న మత్స్యకారులు

మత్స్యకారుల పెన్షన్ వయో పరిమితి తగ్గించాలి..

దశాబ్దాలుగా మేము చేపల వేటనే నమ్ముకుని బతుకుతున్నాం. ఎంత శ్రమించినా రోజుకు రూ.500 నుంచి రూ. 600లోపే వస్తుంది. అయినప్పటికీ అలుపెరుగని పోరాటం చేస్తున్నాం. అధిక శ్రమ కారణంగా 50 ఏళ్లలోపే వృద్ధాప్యం మీద పడి కుంగిపోతున్నాం. ప్రభుత్వం 50 ఏళ్లు వచ్చిన మత్స్యకారులందరికీ పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నాం. తద్వారా మా మత్స్యకారులకు మేలు జరుగుతుంది. – పి.దాసు, మత్స్యకారుడు, వాసవానిపాలెం

ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం..

గతంలో వేట విరామ సమయంలో రెండు నెలల పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తేవి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకార భరోసా రూ.10 వేలు చొప్పున వేట విరామ సమయంలో అందజేస్తుండటంతో ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నాం. ఇప్పుడు ఎన్నికల సమయం కావటం వల్ల ఇంకా నిధులు మంజూరు కాలేదు. త్వరలోనే నిధులు మంజూరవుతాయని భావిస్తున్నాం.
– ఎల్లాజీ, మత్స్యకారుడు, అప్పుఘర్

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయో టెక్నాలజీ–కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్టస్' సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జూలై 15వ తేదీన ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తారు. పోస్టర్ ఆవిష్కరణలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.ఎన్.కిషోర్‌బాబు, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.రాధిక తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

2న 'దర్శిని' చిత్ర బృందానికి అభినందన సభ

మద్దిలపాలెం : వికాస్, శాంతి హీరో, హీరోయిన్లుగా డాక్టర్ ప్రదీప్ దర్శకత్వంలో రూపొందించిన దర్శిని చిత్ర బృందాన్ని జూన్ 2న విశాఖలో అభినందించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. రెండు వారాల క్రితం 100కి పైగా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతుందన్నారు. వి–4 క్రియేషన్స్ పతాకంపై ఎల్.వి. సూర్యం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో నటించిన హీరోతో పాటు ఇతర నటీనటులు, అన్ని విభాగాల సాంకేతిక నిపుణులు విశాఖకు చెందిన వారేనని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి సంయుక్తంగా స్థానిక పౌర గ్రంథాలయంలో చిత్ర బృందాన్ని అభినందించనున్నట్లు తెలిపారు. ఈ అభినందన సభలో మేకింగ్ దర్శిని మూవీ పేరిట ఉచితంగా చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టార్ మేకర్ లంక సత్యానంద్, నగర ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. సినీప్రియులు, ఔత్సాహిక దర్శకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జగన్ రెండోసారి సీఎం కావాలని కోరుతూ మేయర్ పూజలు

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు పూజలు చేపట్టారు. ఈ నెల 28 వరకు నగరంలోని పలు గ్రామ దేవతలను దర్శించుకుని సీఎం జగన్ కోసం ప్రత్యేక పూజలు జరిపించిన మేయర్ కుటుంబ సభ్యులు.. బుధవారం గుజరాత్‌లోని ద్వారకను సందర్శించారు. రాష్ట్ర ప్రజలంతా క్షేమంగా ఉండాలని శ్రీకృష్ణ భగవానుడికి మొక్కుకున్నట్టు మేయర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ఏకకాలంలో అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత ప్రగతిపథంలో దూసుకుపోతుందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధిస్తుందన్నారు.



ద్వారకలో కుటుంబ సభ్యులతో మేయర్ హరి వెంకటకుమారి

ఘనంగా దుర్గమ్మ జాతర



బాలుడిని తిప్పుతున్న పులివేషధారుడు



కాళీమాత వేషంలో కళాకారుడు

సీతమ్మధార : దొండపర్తి గ్రామ దేవత శ్రీ దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలు నెలరోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. జాతర నేపథ్యంలో జూన్ 4న దొండపర్తిలో వేంచేసిన అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పిస్తారు. 10వ తేదీన పుట్టబంగారంతో పాటు అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్ తెలిపారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నేలవేషాలు, కాళీమాత వేషధారణలో కళాకారులు తమ ప్రతిభ ప్రదర్శించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎరుకుమాంబకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార : దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకిస్తే కోర్కెలు నెరవేరుతాయని.. అవివాహితులకు వివాహం, సంతానం లేని వారికి పిల్లలు కలుగుతారనే నమ్మకంతో భక్తులు అమ్మవారిని అభిషేకిస్తారని ఆలయ అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వేన్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎస్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం కూడా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్ : కొమ్మాది పంప్ హౌస్‌కు సంబంధించి పంప్ సెట్ మరమ్మతుల కారణంగా జోన్–2, 3 పరిధి పలు ప్రాంతాలకు గురువారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–2 పరిధి చినగదిలి, పెదగదిలి, సూర్యతేజనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, 10వ వార్డుకి సంబంధించి అన్ని ప్రాంతాలు, జోన్–3 పరిధి చినవాల్తేర్, పెదవాల్తేర్, ఆదర్శనగర్, ఎంవీపీ సెక్టార్–8, 11 తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్న దృష్ట్యా ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని ఎస్ఈ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ.. ప్రజల బాధ్యత

మద్రిపాలెం: భూగోళం మీద ఉన్న సమస్త జీవరాశులను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని విశాఖపట్నం డివిజన్ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ కె.రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాధవధారలోని సంస్థ కార్యాలయంలో ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీ పీసీబీ, గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం మన భూమి అంశంపై జరుగుతుందని తెలిపారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారించాలని ఐక రాజ్య సమితి పిలుపునిచ్చిందన్నారు. రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ విశాఖలో చిత్ర లేఖనం వంటి పోటీలు జరుగుతాయని చెప్పారు. అనకాపల్లి, మన్యం జిల్లాల్లోనూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు తలపెట్టామన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి మాట్లాడుతూ, భావితరాలను దృష్టిలో ఉంచుకుని జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలి ఈఈ కరుణరేఖ, ఏఈ శ్రీలక్ష్మి, సైంటిఫిక్ ఆఫీసర్ సంయుక్త, రీసెర్చ్ అసోసియేట్ గౌతమి, సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, వలంటీర్ రాజేశ్వరి, సిఫా ట్రస్టు సిబ్బంది, నర్సింగ్, హేమ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీసీబీ అధికారులు, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధులు

30 మందిపై బైండోవార్ కేసు

ఆరిలోవ : స్థానిక పోలీసులు 30 మంది రాజకీయ నాయకులపై బుధవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉన్నందున ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రతగా చర్యలు చేపడుతున్నట్లు ఆరిలోవ సీఐ జి.గోవిందరావు తెలిపారు. ఇందులో భాగంగా రూరల్ తహశీల్దార్ సమక్షంలో ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు పార్టీలకు చెందిన నాయకులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరూ ఎలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడరాదని అయన తెలిపారు. గొడవలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కాశీవిశ్వేశ్వరాలయ వార్షికోత్సవ పత్రికావిష్కరణ



కరపత్రికను ఆవిష్కరిస్తున్న అర్చకుడు సుధీర్ శర్మ, భక్తులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం వరాహగిరి కాలనీ–2లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరాలయంలో జూన్ 16 నుంచి 29 వరకు 25వ వార్షిక ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం శివాలయంలో భక్తులు, స్థానికులతో కలసి ఆలయ అర్చకుడు అంబటిపూడి సుధీర్ శర్మ వార్షికోత్సవ కరపత్రికను ఆవిష్కరించారు. 25వ వార్షికోత్సవం సందర్భంగా వేదమాత గాయత్రిదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహిస్తామని సుధీర్ శర్మ తెలిపారు.

మలయాళ నవల 'ఆడు జీవితం'పై ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కేరళ సాహిత్యంపై జరిగిన సాహితీ కార్యక్రమంలో మలయాళ రచయిత, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెన్యామిన్ రచించిన ఉత్తమ మలయాళ నవల 'ఆడు జీవితం'పై రచయత, డాక్టర్ కె.జి.వేణు ప్రసంగించారు. సౌదీ అరేబియాలో వలస వచ్చిన కార్మికులను ఎలా బానిసలుగా మారుస్తారో చెప్పే నవలగా పేర్కొన్నారు. కేరళలోని ఒక గ్రామంలో బోటు నడుపుకుని జీవించే నజీబ్ అనే వ్యక్తి వ్యాపారం బాగా లేదని గల్ఫ్ దేశాలకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటాడన్నారు. ఒక ఏజెంట్ ద్వారా సౌదీ అరేబియాకు చేరుకున్న నజీబ్ అక్కడ పడిన కష్టాలను, దుర్భర బానిస జీవితాన్ని నవలాకారుడు హృదయానికి హత్తుకునేలా రాశారన్నారు. బలమైన కథనం, కథతో నవల చాలా బిగింపుగా సాగిపోతుందని వివరించారు. ఉత్తమ నవలగా 'ఆడు జీవితం' చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు ఎస్.విజయ్‌కుమార్, శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రచయిత కె.జి.వేణు

కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న మానసిక వైద్యుడు విజయ్‌కుమార్

సీతంపేట: సమైఖ్య భారతి ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కుటుంబ వ్యవస్థ పరిరక్షణ' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా మానసిక వైద్యుడు మోపిదేవి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడానికి కార్పొరేట్ విద్యను అభ్యసించిన విద్యాధికులు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలే ప్రధాన కారణమన్నారు. ఆచార్య సి.మంజులత మాట్లాడుతూ కుటుంబ సభ్యులు కలిసి చర్చించుకునే పద్ధతి లోపించడం వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైందన్నారు. ఎం.రూపవాణి మాట్లాడుతూ మహిళలు ఐకమత్యంగా ఉంటే చిన్న కుటుంబాలుగా విడిపోవన్నారు. సమైఖ్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ బిజీ జీవితంలో కుటుంబ సభ్యులు కలిసి కూర్చుని మాట్లాడుకునే వీలు కూడా లేకుండా పోయిందన్నారు. కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేస్తూ ఒకరి అభిప్రాయాలు ఒకరు చర్చించుకుని కష్టసుఖాల్లో తోడు ఉండేలా ఉండాలని పేర్కొన్నారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు చినసూర్యనారాయణ, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, చింతా ప్రభాకర్, ఫణిస్వామి, పత్తి ప్రసాద్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం ఎంవీఆర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీగీతాలు ఆలపించి అలరించారు.

చిత్రలేఖన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ బాలభాను విద్యాలయం ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 2న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 'ప్రపంచ పర్యావరణం–పరిరక్షణ' అనే అంశంపై పోటీ జరుగుతుందన్నారు. 3–5 తరగతులు, 6–8 తరగతులను ప్రత్యేక విభాగాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 94926 41242, 91210 07683 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు 39 మంది గైర్హాజర్

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 39 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 357 మంది హాజరు కావాల్సి ఉండగా 340 మంది హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వీరిలో ఫిజిక్స్ పరీక్షకు 9 మంది, ఎకనామిక్స్‌కు 8 మంది హాజరు కాలేదని ఆయన తెలిపారు. కాగా మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సం పరీక్షకు 495 మంది హాజరు కావాల్సి ఉండగా 473 మంది హాజరు కాగా 22 మంది హాజరు కాలేదన్నారు. వీరిలో ఫిజిక్స్‌కు 11 మంది, ఎకనమిక్స్‌కు 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వెంకన్న ఆలయంలో విశేషంగా హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద చక్రపెరుమాళ్లను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, ,పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీ సమేతంగా హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చురుగ్గా దివ్యాంగ బాలల సర్వే



సర్వేలో పాల్గొన్న ఎంఈవో బాలామణి

సీతంపేట: బడి బయట ఉన్న దివ్యాంగ బాలలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్టు ఎంఈవో బాలామణి తెలిపారు. అక్కయ్యపాలెం, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ బాలలను గుర్తించి భవిత సెంటర్‌లో చేర్పించాలని కోరారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలోని భవిత సెంటర్‌లో ఉన్న సదుపాయాలు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలు, దివ్యాంగులకు ఇచ్చే శిక్షణపై బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 20 మంది బాలలను గుర్తించామన్నారు. జూన్ 9 వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భవిత టీచర్స్ జగదాంబ, శారద పాల్గొన్నారు.

యువతకు సాల్వ్ ఫర్ టుమారో పోటీలు

టీచ్‌రోడ్డు : సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచనలపై విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి సాల్వ్ ఫర్ టుమారో పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు శాంసంగ్ కో ఆర్డినేటర్ ఎస్పి చున్ తెలిపారు. పోటీల వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. నాయకత్వం వహించేందుకు యువ ఆవిష్కర్తలకు ఈ కార్యక్రమం ఆహ్వానం పలుకుతుందన్నారు. విజేతలకు రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు గ్రాంట్‌ను బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సెమీ కండక్టర్ పరికరాలతో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం నుంచి ఏఐ ద్వారా నూతన ఆవిష్కరణల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సాల్వ్ ఫర్ టుమారో వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కరాటే క్రీడాకారుడికి చేయూత

భీమునిపట్నం: కరాటేలో ప్రతిభ చూపిన బాలుడికి స్థానిక స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ బుధవారం ఆర్థిక సాయం అందించింది. నేరెళ్లవలస కాలనీకి చెందిన కోలా అభిషేక్ కరాటేలో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పలు పతకాలను సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.



బాలుడికి రూ. 5 వేలు చెక్కు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.